క్లుప్తంగా

భ్రమరాంబాదేవికి ఊయలసేవ


అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామి అమ్మవార్లను ఆశీనులు చేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైల గ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మకు విశేషపూజలు చేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు చేపట్టిన అనంతరం నాలుగు దిక్కుల్లో బలిహరణ పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు.

చిరుధాన్యాల్లో పోషకాలు

పాములపాడు: చిరుధాన్యాలు, ఆకుకూరల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, వాటిని ప్రతి రోజు ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని ప్రధానోపాధ్యాయురాలు వెంకట సుబ్బమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిరుధాన్యాలు, ఆకుకూరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వాటిని విద్యార్థినులకు చూపిస్తూ కలిగే ఉపయోగాలను వివరించారు. పోషకాలు శరీరానికి సంపూర్ణంగా అందితే రక్త హీనత లోపం ఉండదని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రభావతి, అంజలీదేవి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి ధ్యేయం


మాట్లాడుతున్న చైర్ పర్సన్

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణాభివృద్ధే తన ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మంచినీటి బోర్లను మరమ్మతులు చేశామన్నారు. అవసరమైన చోట కొత్త బోర్లు వేస్తామన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు . అనంతరం పలు తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, కౌన్సిలర్లు , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీచెన్నకేశవ స్వామి రథోత్సవం

పగిడ్యాల: శ్రీరామనవమిని పురస్కరించుకుని శుక్రవారం మండల కేంద్రం పగిడ్యాలలో నిర్వహించిన లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. మండల తహసీల్దార్ భారతీ, ఎంపీడీఓ వెంకటరమణ, దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి మోహన్, జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న రథానికి ప్రత్యేక పూజలు చేశారు.

- శ్రీరామనవమిని పురస్కరించుకుని పగిడ్యాలలో శుక్రవారం పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. ఇందులో తిమ్మాపురం బైరవ పొట్టేలు విజేతగా నిలిచాయి. మండ్లెం ఖాదర్‌వలి పొట్టేలు రెండవ స్థానం, నాగటూరు ప్రశాంత్ పొట్టేలు మూడవ స్థానం, లక్ష్మాపురానికి చెందిన షేక్ షేక్షావలి పొట్టేలు నాలుగో స్థానంలో నిలిచాయి.

సదుపాయాలపై దృష్టి పెట్టండి


ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

పాములపాడు: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని డీఎల్‌డీఓ జనార్దన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని చెలిమిల్ల, మద్దూరు, వేంపెంట, కొత్తబానకచెర్ల గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. ఇళ్ల నిర్మాణాలను, సదుపాయాలను పరిశీలించారు. త్వరగా తాగు నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఇప్పటి వరకు ఇంటినిర్మాణాలు ప్రారంభించని వారిని కలిసి పనులు మొదటుపెట్టేలా చూడాలన్నారు. తర్వాత ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో చేపట్టిన మన బడి- నాడు నేడు పనులను పరిశీలించారు. యర్రగూడూరు గ్రామంలో సచివాలయాన్ని, పాములపాడులో ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుమిత్రమ్మ, హౌసింగ్ ఏఈ శివరామకృష్ణారెడ్డి, ఎంఈఓ బాలాజీనాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మురిపిస్తున్న మినుము

- మార్కెట్‌లో ఆశాజనకంగా ధరలు
- క్వింటా ధర రూ.8 వేల నుంచి రూ.8,200
- ఆనందంలో మినుము రైతులు


ఆత్మకూరు వద్ద సాగు చేసిన మినుము పంట (ఇన్‌సెట్) మినుము

ఆత్మకూరు: ఆత్మకూరు, నందికొట్కూరు డివిజన్‌లో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు సరిగ్గా పండలేదు. వరి, మొక్కజొన్న, కంది పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అయితే, రబీలో రైతులు సాగు చేసిన మినుము పంట కొంత ఊరటనిచ్చింది. ఈ పంట సైతం చీడపీడల తెగుళ్ల వలన ఆశించినంత స్థాయిలో పంట దిగుబడి లేకపోయినప్పటికీ మార్కెట్‌లో మంచి ధర పలుకుతుండటంతో అన్నదాతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మినుము సాగు వివరాలు

రబీలోఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో మినుము పంట అధికంగా సాగు చేశారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలో 10,659 హెక్టార్లు, నందికొట్కూరు డివిజన్ పరిధిలో 8 వేల హెక్టార్లకు పైగా నే ఈ పంట సాగు చేశారు. ఎకరాకు 5 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గతేడాది 8 నుంచి 14 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది. అయితే, గతేడాదితో పోల్చితే ఈ సారి మంచి ధర ఉండటం రైతులకు కలిసొస్తుంది.

తెగుళ్ల బెడదతో తగిన దిగుబడి

ఈ ఏడాది మినుము పంటకు తెగుళ్లు ఆశించి దిగుబడులను దెబ్బతీశాయి. తామర పురుగు ఆశించడంతో పంట దిగుబడి భారీగా తగ్గింది. ఈ పరిస్థితిలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది సీ-9 , 31 పంటలను సాగు చేశారు. ఈ పంటలు భారీగా దెబ్బతినడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మినుము పంటలో తామరపురుగుతో పాటు తెల్లదోమ, లద్దె పురుగు, బూడిద తెగులు, ఆకు మచ్చ తెగులు, పల్లాకు తెగులు వ్యాపించడంతో దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది.

మెరిసిన మినుము ధర

ఈ ఏడాది రబీలో సాగు చేసిన మినుము పంటకు ధర అధికంగా ఉండడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్వింటా ధర రూ.8 నుంచి రూ.8,200 వరకు ధర ఉండడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతేడాది మినుము క్వింటా రూ.6 వేల నుంచి రూ. 7 వేలు మాత్రమే పలికింది. ఈ ఏడాది క్వింటంపై రూ.1500 వరకు అదనంగా దక్కడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి తగ్గినా, ధర ఉండడం వలన ఎకరాకు 6 క్వింటాళ్లు వచ్చినా రూ.48 వేలకు పైగా రైతులకు అందుతోంది. 5 ఎకరాలు వేసిన రైతులకు దాదాపుగా రూ.రెండున్నర లక్షల వరకు నగదు రావడంతో సంబరపడుతున్నారు. 6 క్వింటాళ్ల కంటే అధికంగా దిగుబడి సాధించిన రైతులు మరింత ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర సంతృప్తికరంగా ఉంది



ఈ ఏడాది 3 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. పెట్టుబడి, రసాయన, క్రిమిసంహారాల కోసం రూ.లక్షవరకు ఖర్చుపెట్టాను. పంట దిగుబడి తగ్గినప్పటికీ ధర సంతృప్తికరంగా ఉండడంతో కొంత మేరా నష్టంతగ్గింది. పంట 6 నుంచి 8 క్వింటాళ్ల మాత్రమే పండింది. అయినప్పటికి ధర అధికంగా ఉండడంతో లోటు భర్తీ అయ్యింది.

–హనుమంతరెడ్డి, ఆత్మకూరు

గతేడాది కంటే ఎక్కువే



ఈ ఏడాది మినుము పంట ధర అధికంగా ఉంది. ఈ ఏడాది రబీలో 5 ఎకరాలకు పైగా మినుము పంట సాగు చేశాం. తెగుళ్ల వలన పంట దిగుబడి కొంత తగ్గింది. అయినా క్వింటాల్ రూ.8,200 వరకు ధర పలుకుతుంది. మంచి ధర కావడంతో అన్ని ఖర్చులు పోగా లాభం వస్తుంది.

– వెంకటేశ్వర్లు, బావనంతపురం

ధర తగ్గితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



ఈ ఏడాది రబీలో మినుము సాగు చేసిన రైతులకు ధర అధికంగా ఉంది. ఈ ఏడాది పంటకు అత్యధికంగా పల్లాకు తెగులు , తెల్లదోమ, పచ్చదోమ, తామర తెగులు వ్యాపించడం వలన దిగుబడి కొంత తగ్గింది. అయినప్పటికీ మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండడంతో మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ధర తగ్గితే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఆత్మకూరు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భాస్కర్

నందికొట్కూరు: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె. భాస్కర్ గెలుపొందినట్లు ఎలక్షన్ ఆఫీసర్ జె. వెంకట రాముడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. పోలైన 60 ఓట్లలో సి. విజయకుమార్ 22, కె. భాస్కర్‌కు 35, మరో మూడు ఓట్లు నోటాకు పడ్డాయి. 13ఓట్ల మెజార్టీతో భాస్కర్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ పదవులకు నామినేషన్లు దాఖలు కాలేదు. జనరల్ సెక్రటరీగా వడ్ల శరభయ్య, కోశాధికారిగా వడ్ల అరుణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్మకూరులో ఏకగ్రీవం

ఆత్మకూరు: ఆత్మకూరు బార్ అసోసియేషన్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా హుసేన్ మియా, లైబ్రేరియన్‌గా చింతలయ్య, ట్రెజరర్‌గా లక్ష్మీనారాయణ, మీడియా కార్యదర్శిగా భాస్కర్‌ను ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పుల్లారెడ్డి, నూర్ అహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గోవిందరెడ్డి, నాగిరెడ్డి, అబ్దుల్‌కలాం, మాణిక్యరావు, వెంకటేశ్వర్లు, వీర్రాజు, సిద్ధిఖ్, అలీఖాన్, సుబ్రమణ్యం, రామకృష్ణ, బలరాంనాయక్, సుదర్శన్, బతుకులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ధర్మకర్తల మండలి మీటింగ్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సమావేశం శనివారం ఉదయం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో జరగనుంది. ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ఆలయ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, పర్యవేక్షకులు పాల్గొననున్నారు.

వేలం పాటలు పూర్తి

నందికొట్కూరు: మున్సిపాలిటి పరిధిలో 2023-24 ఏడాదికి సంబంధించి వారపు సంత, దిన మార్కెట్, బస్టాండ్, జంతువధ శాల, మటన్ మార్కెట్ వేలాలు పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో వేలం పాటలు నిర్వహించగా వారపు సంత రూ, 7,23,000, దిన మార్కెట్ రూ. 4, 75, 000, బస్టాండ్ రూ. 4,50, 000, జంతువధ శాల రూ. 1,08, 000, మటన్ మార్కెట్ రూ. 1,11, 000 పలికినట్లు తెలిపారు. మొత్తం మీద గత్తేడాది కంటే ఈ ఏడాది రూ. 73, 000 అధిక ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్ఓ విజయలక్ష్మి, ఆర్ఐ రంగన్న, విక్రమ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యులను శిక్షించాలి

కొత్తపల్లి: గిరిజన నిమ్మల వెంకటేశ్వర్లు మృతిపై అనుమానాలున్నాయని, విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ నాయక్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడారు. మృతుడి భార్య నిమ్మల శివమ్మకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

పగిడ్యాల: స్థానిక బస్టాండ్ ఆవరణలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం ఎంపీడీఓ వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ పుల్లయ్య, ఎంఈఓ సుభాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడి పాల్గొన్నారు.

మిడుతూరు: బాటసారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సుంకేసుల గ్రామ బుక్ కీపర్ కుళాయి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సుంకేసుల బాట వద్ద ఆయన చలివేంద్రం ఏర్పాటు చేశారు.

తగ్గిన ఆదాయం

జూపాడుబంగ్లా: మండల కేంద్రం జూపాడుబంగ్లా సంతగేటు, బండమెట్టకు శుక్రవారం వేలం నిర్వహించారు. సర్పంచ్ మొట్టె బాలయ్య అధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో మోతెసురేష్ అనే వ్యక్తి అత్యధికంగా రూ.1,90,000లకు పాట పాడి వాటిని దక్కించుకున్నారు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది రూ.3వేలు ఆదాయం తగ్గినట్లు పంచాయతీ కార్యదర్శి శాంతయ్య తెలిపారు.

3 నుంచి పింఛన్ల పంపిణీ

వెలుగోడు: ప్రతినెలా ఒకటో తేదీ నుంచి అందిస్తున్న సామాజిక పింఛన్లు ఏప్రిల్ నెలలో 3వ తేదీ నుంచి పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. ఏప్రిల్ ఒకటి ,రెండు తేదీల్లో బ్యాంకులకు సెలవు కావడంతో 3న పింఛన్లు అందిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమనించాలన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం


పొదుపు మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్


హాజరైన పొదుపు మహిళలు

- ఆసరా ఉత్సవాల్లో నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్
- లబ్ధిదారులకు మెగా చెక్ అందజేత

జూపాడుబంగ్లా: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్ర జూపాడుబంగ్లాలోని వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయ ఆవరణలో ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందితే కుటుంబం, సమాజం బాగుంటుందన్నారు. ఈ ఉద్దేశంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సంక్షేమ పథకంలో వారికి పెద్ద పీట వేస్తున్నారని చెప్పారు. పాదయాత్ర సమయంలో పొదుపు మహిళల ఇబ్బందులు తెలుసుకుని వారికి రుణమాఫీ హామీ ఇచ్చారన్నారు.ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే హామీని అమలు చేశారన్నారు. ఇలా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అమ్మ ఒడి,విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. మండలంలోని 886 పొదుపు సంఘాలకు మూడోవిడతగా రూ.156.09 లక్షలు విడుదలైనట్లు తెలిపారు.

ప్రలోభాలకు తలొగ్గలేదు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయాలని తనకు కొంత మంది అర్ధరాత్రి ఫోన్‌చేసి డబ్బు ఎర చూపారని, అయినా తాను తలొగ్గలేదని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. తనకు జీవితం ప్రసాదించిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మణిమంజరి, ఏపీఎం అంబమ్మ, వైఎస్ ఎంపీపీ రవణమ్మ, సర్పంచులు మొట్టె బాలయ్య, ఈదుల ఈశ్వరరెడ్డి, వంగల లక్ష్మీదేవి, శ్యామలమ్మ, బాలమద్దిలేటి, ఎంపీటీసీలు మోతె వెంకటమ్మ, సంటిగారి కృపాకర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాలపెద్దన్న, కరుణాకర్‌రెడ్డి, దేవసహాయం, శివానందరెడ్డి, వంగల కృష్ణారెడ్డి, ఎంఈఓ మోహన్, వెటర్నరీ ఏడీ రామాంజనేయనాయక్, డాక్టర్ పావనిరెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని 15 వార్డులకు చెందిన 42 పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద విడుదలైన రూ. 25,75, 982 చెక్కును నందికొట్కూరు మునిసిపల్ కార్యాలయ మేనేజర్ బేబి అందజేశారు. ఈసందర్భంగా మహిళలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆసరాతో అభివృద్ధి బాట

కొత్తపల్లి: వైఎస్సార్ ఆసరా పథకం మహిళల అభివృద్ధికి దోహదపడుతుందని గిరిజన మహిళా సమాఖ్య కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన మహిళా సమాఖ్య కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా పథకం ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా కో ఆర్డినేటర్ స్వయంగా తయారు చేసి ప్రదర్శించిన ఆసరా నమూనా ఆకట్టుకుంది. మండలంలోని 13 గిరిజన మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం రూ.9,27,336 నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.


ఆసరా పథకం గురించి నమూనా ద్వారా మహిళలకు అవగాహన కల్పిస్తున్న కో- ఆర్డినేటర్


వివాదాస్పదంగా నదిలోతట్టు భూముల సాగు

- పోలీసు స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- పొలంలోకి దిగితే చర్యలు తప్పవని ముచ్చుమర్రి ఎస్ఐ హెచ్చరిక


నీటి మునక పొలంలో ట్రాక్టర్ విత్తనం వేస్తున్న దృశ్యం

పగిడ్యాల: కృష్ణానది లోతట్టు భూముల సాగు విషయంలో రెండు వర్గాల మధ్య వివాదానికి దారితీసింది. వివరాల్లోకి వెళితే.. నెహ్రూనగర్ నీటి ముంపు పునరావాస గ్రామం. ఈ గ్రామ పంచాయతీకి పీకే ప్రాగటూరు, అర్లపాడు, వీరాపురం, ఎల్లంబావి, మూర్వకొండ గ్రామాలు మజరాలు. 1980లో శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణం కారణంగా ఈ గ్రామాలన్నీ ముంపుకు గురయ్యాయి. నాటి నుంచి ఆయా గ్రామాల ప్రజలు బ్యాక్‌వాటర్‌లో చేపల వేట సాగించడం, జనవరిలో నీరు తగ్గగానే తేలిన భూముల్లో పంటలు సాగుచేసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. అర్లపాడు ఘాట్ వద్ద గల పాడుబడిన శివాలయం చుట్టు కృష్ణానది లోతట్టు వరకు ఉండే సుమారు 180 ఎకరాల భూమిని పీకే ప్రాగటూరు గ్రామ వాసులు ఆజమాయిషీ కలిగి ఏటా కౌలుకు ఇస్తున్నారు. వచ్చిన సొమ్మును గ్రామాభ్యుదయానికి వినియోగిస్తున్నారు. సుమారు 30 ఏళ్ల నుంచి ఈ పద్ధతి సాగుతుంది. అయితే, నాలుగు రోజుల క్రితం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన మండ్ల సుధాకర్‌నాయుడు, మండ్ల పులేంద్రనాయుడు, మండ్ల మహేష్‌నాయుడు, మండ్ల పులద్దర్‌నాయుడు, మండ్ల రామాంజనేయులు నాయుడుతో పాటు మరి కొందరు అర్లపాడు ఘాట్ వద్దకు చేరుకుని మా పూర్వీకులు నిర్మించిన శివాలయం దగ్గరే మా పొలం ఉన్నందున అక్కడి నుంచి నది లోతట్టు వరకు ఉండే భూమిని తామే సాగు చేసుకుంటామని పోలీసుల పేరు చెప్పి శుక్రవారం ఉదయం విత్తనం వేసేందుకు ట్రాక్టర్‌ను పంపారు. అక్కడే ఉన్న పీకే ప్రాగటూరు గ్రామ వాసి నరసింహానాయుడు ఆ పొలంలో విత్తనం వేయకుండా ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నా ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున ఘర్షణ పడకుండా ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించుకున్నారు. నీటి మునక భూములపై ఎవరికీ అధికారం లేదన్నారు. ఈ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తానని, అప్పటి వరకు ఎవరూ ఆ భూముల్లోకి వెళ్లరాదని హెచ్చరించారు. గతంలో మండ్ల పులేంద్రనాయుడు పాతూరు తిప్పపై గంగమ్మ గుడి నిర్మిస్తామని నమ్మించి జేసీబీలతో చదును చేసి చేపల పట్టుగా మార్చాడని, మళ్లీ ఇప్పుడు తిప్ప నుంచి నది లోతట్టు వరకు సక్కగా ఉన్న పొలాన్ని ఆక్రమించుకుని పట్టు చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని పీకే ప్రాగటూరు గ్రామస్తులు విలేకరులతో వాపోయారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు


బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: తుడిచెర్ల గ్రామంలో శుక్రవారం ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మొత్తం 12 జతల ఎడ్లు పాల్గొన్నాయి. ఇందులో పంచలింగాల గ్రామానికి చెందిన సుంకన్న బ్రదర్స్ ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.30 వేలు కైవసం చేసుకోగా రేమటగ్రామానికి చెందిన రేమటగిడ్డయ్య ఎద్దులు ద్వితీయస్థానంలో నిలిచి రూ.20 వేలు దక్కించుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం, గద్వాల జిల్లాకు చెందిన నాగరాజు ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ.15వేలు, వైఎస్సార్ కడప జిల్లా, దువ్వూరుకు చెందిన సురేష్‌కుమార్ ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి రూ.10 వేలు, నంద్యాల జిల్లా, గడిగరేవులకు చెందిన బలరాముడు వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.9 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా సాంబవరం గ్రామానికి చెందిన ఉమర్‌బాషా ఎద్దులు ఆరోస్థానం (రూ. 8వేలు), నందికొట్కూరు తాలూకా పీపనగండ్లకు చెందిన మారుతిబాబు ఎద్లు ఏడోస్థానం (రూ.7వేలు), బేతంచెర్ల మండలం, బలపాలపల్లె గ్రామానికి చెందిన మాత్రి సురేష్‌కు చెందిన ఎద్దులు 8వస్థానం (రూ.6వేలు), ఆత్మకూరు మండలం, కరివేనకు చెందిన భాస్కరరెడ్డి ఎద్దులు 9వ స్థానం (రూ.5వేలు), బండిఆత్మకూరు మండలం, కాకనూరుకు చెందిన దావీదు ఎద్దులు పదోస్థానం (రూ.4వేలు) దక్కించుకున్నాయి. విజేత ఎడ్ల యజమానులకు సర్పంచ్ బాలమద్దిలేటి, వైఎస్సార్‌సీపీ నాయకులు దొడ్డాసుధాకర్, వెంకటరమణయ్యశెట్టి, సత్యనారాయణశెట్టి, గోపాల్‌రెడ్డి, దొంతులనరసింహుడు, రామకృష్ణుడు, నాగేశ్వరరావు, దొంతులనారాయణయాదవ్, ఎస్ఐ రామాంజనేయుడు, మధుకృష్ణ, అయ్యన్న, నల్లబోతులరాముడు, వెంకటసుబ్బయ్య, తిమ్మన్న నగదు బహుమతులను అందజేశారు.

మొరుసు తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలి


మొరుసు తవ్వకాలపై ప్రశ్నిస్తున్న బండి ఆత్మకూరు సర్పంచ్ సంధ్య

బండిఆత్మకూరు: కుందూనదిలో మొరుసు తవ్వకాలపై గ్రామ పంచాయతీకి అనుమతులు ఇవ్వాలని బండిఆత్మకూరు సర్పంచ్ సంధ్య కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అధ్యక్షతన ఎ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్ సంధ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలో పేదలు ఇళ్లు నిర్మాణం చేసుకుంటున్నారన్నారు. అయితే ఇళ్ల నిర్మాణంలో అవసరమైన పూడిక కోసం పేదలు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ద్వారా మొరుసును తరలించడానికి అనుమతులు ఇవ్వాలని సర్పంచ్ కోరారు. ఇందుకు ఎంపీడీఓ స్పందిస్తూ గ్రామ పంచాయతీకి ఇసుక, లేదా మొరుసును తరలించే అధికారం లేదన్నారు. రెవెన్యూ అధికారులు మాత్రమే అనుమతులు ఇవ్వాలని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బూరం శివలింగం, భోజనం సర్పంచి బారెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు ముంతల మధురాణి , ఏపీఓ వసుధారెడ్డి, ఈఓఆర్డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు సమీపంలో దారి దోపిడీ

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు-శింగవరం గ్రామాల మధ్య గురువారం రాత్రి 10 గంటల సమయంలో దారి దోపిడీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. శింగవరం గ్రామానికి చెందిన రైతు ధనుంజయ గౌడు బండిఆత్మకూరు నుంచి రాత్రి పది గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. కేసీకెనాల్ వారధి వద్ద అగంతకులు బైక్‌పై వేగంగా వచ్చి ధనుంజయను కత్తులతో బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. అయితే, తన వద్ద డబ్బులు లేవని చెప్పగా సెల్‌ఫోన్ ద్వారా బ్యాంక్ బ్యాలెన్స్ చూపించాలని బెదిరించారు. తర్వాత సెల్‌ఫోన్, పాస్‌వర్డ్ నంబర్ తీసుకెళ్లి బ్యాంక్ ఖాతాలో నుంచి రూ. 12 వేలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేస్తున్నారు.

ఉల్లాసంగా వసంతోత్సవం

పాములపాడు: శ్రీరామనవమి పండుగను పుర స్కరించుకొని శుక్రవారం మండల కేంద్రం పాములపాడులో వసంతోత్సవం నిర్వహించారు.ఎడ్ల బండిపై రంగు డ్రమ్ములతో ఊరంతా తిరిగారు.యువకులు రంగులు చల్లుకుంటూ డప్పు వాయిద్యాలకు లయబద్ధంగా చిందులు వేస్తూ వసంతోత్సవ వేడుకను జరుపుకున్నారు.

- **వెలుగోడు:** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో యువకులు వసంతోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఎద్దుల బండిపై నుంచి రంగునీళ్లు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. ఆర్యవైశ్య రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులకు వనభోజనం ఏర్పాటు చేశారు.

తర్తూరు జాతరకు బస్సు సౌకర్యం

నందికొట్కూరు: తర్తూరు జాతరకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని మొత్తం 10 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.